తివాచీ

శ్రీ 'పాత్రో'

చుట్టూ ప్రహారీ. ప్రహారీ నిండుకూ పూల తోట. దూరాని కాతోట స్పాంజ్ షీట్‌లా ఉంది. తోట మధ్య మేడ, స్పాంజ్ షీట్ మీద ఉంచిన సబ్బు పెట్టెలా. మేడముందు విరగబూసిన మల్లెగుబురు, ఒంటినిండా పూలు అలంకరించుకుని వచ్చే వాళ్ళకు స్వాగతం పలుకుతున్న కన్నెపడుచులా.

ఆ మేడలో ఒక ప్రక్క డ్రాయింగ్‌రూం, శిరస్సులో మెదడులా. ఆ మెదడులో పుట్టిన అంద మైన ఊహల జంటలా రెండు ప్రాణులు. ఒక ప్రాణి అతడు., మరొక ప్రాణి ఆమె. అతడు భర్త. ఆమె భార్య. అప్పుడే పాలీష్ ఇచ్చినస్టీలుగ్లాసులా మెరుస్తున్నా డతడు. సీలు తీసిన సబ్బుబిళ్లలా నవ నవలాడుతోంది ఆమె. స్టీలుగ్లాసుపేరు చంద్రం. సబ్బుబిళ్లపేరు సునంద.

"వాళ్లు వస్తామన్నది తొమ్మిదికే గదండి. తొమ్మిది కింక పది నిముషాలు మాత్రమే ఉంది" అన్నది సునంద, చేతిలో మెరుస్తున్న బంగారుచైన్ వాచ్ కేసి చూస్తూ.

"తొమ్మిదంటే తొమ్మిదికేనా? ఇండియాలో ఇంతవరకి చెప్పిన టైముకి ఎవరైనావచ్చి ఉన్నా రేమిటి?" అన్నాడు చంద్రం, పెద్దగా నవ్వితే పర్స నాలిటీ దెబ్బతింటుందేమో నన్న భయంతో సగం నవ్వులో సగంమింగేసి సగంలో సగం తేలికగా నవ్వుతూ.

"నిన్న మనం వెళ్లలేదూ వాళ్లింటికి?" అన్నది, కాశ్మీర్ సిల్కుచీర నలగని కుచ్చెళ్లు నల క్కుండా సవరించుకుంటూ.

"మనమంటే—నువ్వూ నేను! నువ్వూనేనంటే మనమిద్దరమే. ఇద్దరంటే ఇద్దరమే. నేను తల, నువ్వు తోక. నాకు తలలేదు. నీకు తోకలేదు. అనుకోవడమూ, అప్పుడే టింగు రంగా మని చేతులు పట్టుకుని వెళ్లి పోవడమూ. వాళ్లో?" అన్నాడు ఆమెవేపుచూస్తూ.

ఆ చూపు ఖాళీగాఉంది.

"అవును లెండి! వాళ్లిద్దరూ, ఆ ఇద్దరి వెంట ముగ్గురు. మొత్తం ఐదుమంది. పంచేంద్రి యాలు ఒక తాటిమీద నడవడమంటే మాటలా" అన్నది నిట్టూరుస్తూ. ఆ నిట్టూర్పులో నీటితో నిండిన మబ్బుబరువులోని బరువంత బరువు ఉంది.

"ఇష్షు! లెక్కకట్టకు" అన్నాడు చిలిపిగా పెదిమల కడ్డం చూపుడువ్రేలుపెట్టి.

"ఏం?" అన్నది కళ్లు చిలికించి.

"దిష్టితగులుతుందని మా అమ్మమ్మ చేప్పేది"—పెదిమల చివరి వంపులో కొంటెతనం.

"ఇది అమ్మమ్మ కాలంగాదు. ఆకాశానికెగిరే కాలం. అది పోనీ—కానీయండి! వాళ్లగోపీనిచూశారూ, అబ్బ! ఎంతముద్దొస్తాడండి!" అన్నది తన్మయ త్వంతో ముద్దఅయిపోతూ.

"అవును. గోపీ వాళ్ళబిడ్డ కదూ! ఎందుకు రాడూ?"

"పెద్దమ్మాయి ఉంది చూశారూ? ఆరో తరగతి చదువుతుందట. ఇంగ్లీషు పొయిట్రీ ఎంత బాగా చెబుతుం దనుకున్నారు?"

"రెండో అమ్మాయి ఏం చేస్తుంది? ముద్దు ముద్దుగా ఏడుస్తుందా?" అన్నాడు విసుగ్గా.

"అయ్యో! ఎంత అమాయకులండీ మీరు? రెండోది అమ్మాయి కాదు అబ్బాయండి." అన్నది, వెర్రిగా నవ్వుతూ.

"వాళ్లతల్లి తన మంచీ, మర్యాదా మరచి బిడ్డలే తన సర్వస్వం అనుకుని పెంచుతూంటే నీలాంటి వాళ్లకు వాళ్లు ముద్దొస్తున్నారు" అన్నాడు నిర్లిప్తంగా.

"అవునండి. మనం వెళ్లినప్పుడు కూడా ఆమె మాసిన చీరతోనే ఉంది."

"ఆమెచీర మాసినా, మాయని సంస్కారం– మచ్చలేని మాతృత్వం ఉన్నాయామెలో...... అద్సరేగానీ, మన టామీ ఏమో సడి చేస్తున్నాడు. వాళ్లొస్తున్నారేమో చూడు!" అన్నాడు.

"ఆఁ. టైమయిపోయింది. వాళ్లే అయివుంటారు" అని ఆదుర్దాగా లేచి వరండాలోకి వచ్చింది. ఎవరూలేరు. రోడ్డుమీద ఏదోకుక్క మొరుగుతోంది. నీరసంగా వెనక్కి తిరిగి వచ్చింది.

"మీది మరీ పిచ్చండి! రోడ్డుమీద కుక్క మొరుగుతుంటే మన టామీ అంటారు" అని రేడియోగ్రాం ఆన్‌చేసివచ్చి ముందు కూర్చున్న సోఫా మీదనే కూర్చుంటూ— "ఇలాఎదురుచూపుల చూడాలంటే నాకు మహా విసుగేస్తుందంటే నమ్మండి. ఒక్కోరోజు మీరుకూడా ఆఫీసునుంచి ఎంతకూ రాక విసిగించేస్తారిలాగే" అన్నది.

సంగీత సౌరభం గది పునాదుల్ని సన్నగా కదిలిస్తోంది. సంగీతానికి, సాహిత్యానికి అద్భుతమైన ఒక శక్తి ఉంది. రెంటికీ పులిగోళ్లున్నాయి. ఆ గోళ్లతో గుండెను గీకి వేదనల నెత్తురును తోడుతాయి. నెత్తురుతో పాటు అలౌకికమైన అమృతాన్ని గూడా వెలికి తీస్తాయి.

"ఏమండీ! నేనొక విషయం చెప్పనా?" అన్నది ఉత్సాహంగా అతని ప్రక్కకు జరిగి.

"ఇప్పుడు చెప్పేవన్నీ నన్నడిగే చెబుతున్నావా? అలాగే ఇదీ చెప్పు!".

"పోండి! మీకు మాటికిముందు చిరాకు!" అని ముందున్న స్థానంలో కూర్చుంది మూతి ముడుచుకుని.

"నాకా చిరాకు? టామీని అడుగు. చిరాకు ఎవరికో దానికూడా బాగా తెలుసు,....పోనీ చెప్పమంటున్నానుగా ఇంతలో ఆ అలక ఏమిటి?"అని భుజంమీద చెయ్యివేసి తనవైపు త్రిప్పుకున్నాడు.

"మీరు కోప్పడరు కదా?."

కోప్పడనని తలాడించాడు.

"మీరు ఆఫీసరు కదా!" అన్నది.

"ఇప్పుడెందుకొచ్చిందా సందేహం?".

"మీ ఆఫీసులో పనిచేసే హెడ్‌క్లర్కు కదా ఆయన?".

"అవును".

"ఆయన కింతమంది బిడ్డలూ, ఇంత సంసారముందికదా?".

"అవును."

"ఆయన కొచ్చేజీతం ఎక్కడికి చాలుతుందండి?".

"ఉహూ."

"మీరు ఆఫీసరైనందుకు ఇంకొంచెం జీతం ఎక్కించరాదూ?".

"ఆ!".

"మీకు కొంచెంకూడా జాలిలేదండీ!".

"అవును."

"ఏమిటి అవును?".

"నిజమే!".

"ఏమిటా ఊతపదాలు? ఆయన జీతం విషయం చెబుతుంటే అవును, నిజమే, ఆహా, ఉహూ అంటూ వంతపాట ప్రారంభించారూ?".

"అవును. నాది వంతపాట. నీది వింతమాట. ఆ ఆఫీసు మన తాతది. అంతా మన ఇష్టమే! దానికి రూల్సూ, పాడూ ఏమీలేవు".

"ఈ మగాళ్లెప్పుడూ ఇంతే! మాటకిముందు రూల్సూ, చట్టాలూ. వీళ్లమాత్రం వాటిని మహా పాటించి ఏడ్చినట్లు. అవిమాత్రం మనిషికి మేలు చేయవద్దంటాయా ఏమిటి".

"ఒహో! బండి మహావేగంతో వెడుతోందే? నువు ఆఫీసరైనప్పుడు అలాగే చేద్దువుగానీ".

"పైగా ఇదొక్కటి నేర్చుకున్నారు. ఏం మాట్లాడినా నువ్వు చేద్దువుగానీ, నువు చూద్దువు గానీ అంటూ నా నోరు నొక్కేస్తారు. మన కెటూ పిల్లలు లేకపోయారు గదా! ఉన్నవారికైనా మేలు చేస్తే. . . . ."

"చెయ్యి, చెయ్యి, లోకంలో పిల్లలున్న వాళ్ల నంతా పిలుచుకువచ్చి వరసాకు మేలుచెయ్యి. లోకంలో ఎవరికి లేరు పిల్లలు, మనకి తప్ప!—" చివర అతని గొంతు జీరబోయింది.

ఆమె మాట్లాడలేదు. అతను మాట్లాడలేదు. ఇద్దరూ మాట్లాడలేదు. సన్నటి సంగీతం హృదయాల్ని తేలిక పరచడానికి ప్రయత్నిస్తోంది. ఇద్దరి మధ్య మౌనంగా దూసుకుపోతున్న కాలపతంగం తన రెక్కల కుంచెలలో సంగీతంలోని కొత్త రంగుల్ని అద్ది వాళ్ల మనసులకు పూసుకుంటూపోతోంది.

"ఇది నాకేదో గమ్మత్తుగా ఉందండీ" అన్నది కొత్త ఉత్సాహంతో.

"ఏది?" అన్నాడు పరధ్యానంగా.

"ఇదేనండి, ఈ ప్లాను. మనం వాళ్లింటికి వెళ్లడం, వాళ్లింట్లో మనకు నచ్చింది చెప్పడం, వాళ్లు మనింటికి రావడం, మనింట్లో వాళ్లకి నచ్చింది చెప్పడం. ఇది తలచుకుంటే మీకుమాత్రం గమ్మత్తుగా లేదూ?......అవునూ, ఈ ప్లాను మొదట ఎవరు చెప్పారండి?" అన్నది ఉత్సాహంగా.

"అతనూ, నేనూ రోజూ క్లబ్బుకు వెళ్లే వాళ్లం ఆఫీసునుంచి అలాగే! ఆఫీసరూ, గుమాస్తా ఇంత అన్యోన్యంగా కలిసి ఉండడం చూస్తే అంద రకూ ఆశ్చర్యం వేసింది."

"ఎందుకండి ఆశ్చర్యం?".

"ఎందుకా నాకర్మ! ఆ మాట నీతో చెప్పాను, నీకేమో మహా అర్థమై ఏడ్చేటట్టు! అదంతా నీకు వద్దుగానీ అసలు విషయం విను. రోజూ క్లబ్బుకు వెళ డమండే మొహం మొత్తినట్లుండేది. ఇదీ ఎందు కని అడక్కు. క్లబ్బుమీద విసుగుపుట్టి మొన్ననో మాటు అలా పార్కుకు వెళ్లాం. పార్కులో కూర్చుని ఇద్దరం మాట్లాడుకుంటున్నాం. మాటలమధ్యలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. రెండురోజులు సెలవులు వస్తున్నాయి కదా, లైఫ్ ఒంటెద్దు గానుగ జీవితంలా డల్‌గా ఉంది, ఈ రెండురోజులు థ్రిల్‌గా గడపాలంటే ఏం చెయ్యాలో ఓ మంచి ప్లాన్ చెప్ప మన్నాను. అతనీ ప్లాను చెప్పాడు. నాకు నచ్చింది. అంతే!" అన్నాడు.

"నచ్చిందీ, ఎందుకు నచ్చదూ? మీరూ మీరూ అనుకోగానే సరిపోయిందా? ఇంట్లో ఆడ వాళ్లం మేమున్నామే!—మా అంగీకారమేమీ అక్కర లేదా?" అంది చిరుకోపంతో.

"ఇది పెద్ద చిక్కే. అయితే మీరిద్దరూ కలిసి ఒక పని చెయ్యండి." అన్నాడు సీరియస్‌గా.

"ఏమిటది?".

"ఇంటిముందు 'విప్లవం వర్ధిల్లాల'ని బోర్డు కట్టి నిరాహారదీక్ష చెయ్యండి".

"చేస్తేగూడా పాపంలేదు" అన్నది బుంగ మూతితో.

"ఆ మొహంచూడు, కొండముచ్చుకు లాగా! మగాళ్లు చేసే ప్రతిపనీ ఆడాళ్లకు చెబుతూ కూర్చుంటే ఇక అన్నీ అయినట్టే!".

"ప్రతిపనీ అని నే ననలేదు. ఇది ఆడవాళ్లకు సంబంధించిన పని— ముందు మాకు చెప్పి తీరాలం టున్నాను."

"మీ జాతిని బాగా వెనకేసుకొస్తున్నావే! ఈసారి మహిళాసమాజానికి నిన్నే అధ్యక్షురాలిగా ఎన్నుకోమని చెబుతానులే!"

"నాభర్త ఆఫీసరైనప్పుడు మళ్లీ నాకెందు కింక పదవి?" అనిలేచి వంటింట్లోకి వెళ్లింది, వంట పనికెలా ఉపక్రమిస్తున్నారో కనుక్కోవడానికి.

వెళుతూ, వెళుతూ—

"దాదాపు పదికావస్తోంది. వీళ్లేం ఇంకారారే! అంటూ వెళ్లింది.

*　　*　　*

రావు వెలుపలి గేటు తీశాడు, లోపలికి ప్రవే శించడానికి!

"ఇదేనాండి వాళ్ల యిళ్లు?" అన్నది సీత చంక బిడ్డను క్రిందికి దించుతూ.

"ఇదే కానీ, ముందు వాడి ముక్కు తుడువు" అన్నాడు రావు, ముఖం చిట్లించుకుని.

"అబ్బ! ఎంతందంగా ఉందండి! ఇంత ఇంటిలో వాళ్లిద్దరేనా?" అన్నది ఆశ్చర్యంగా, చాలీ చాలని తమ అద్దె కొంపను తలచుకుంటూ.

చీర చెరగుతో గోపీ ముక్కు తుడిచింది.

"నీ బుద్ధి పోనిచ్చావుకావు.ఇంటిదగ్గరైతే ఎలా ఏడ్చినా ఫరవాలేదు. పెద్దవాళ్లింటికి వచ్చాము. ఇక్కడ కూడా చీరనలా ఖరాబు చేసుకుంటున్నావు. వాళ్లు చూస్తే ఏమనుకుంటారు? నే నిచ్చిన రుమాలెక్కడ?" అన్నాడు చిరాకుగా.

"ఇదిగో ఉందండి. ఏమిటో అలా అలవాటై పోయింది" అని చీరకట్టులో దోపుకున్న రుమాలు తీసి చూపింది.

"చాల్చాలు! నీ అవతారాలన్నీ కట్టిపెట్టి ఇక్కడున్న నాలుగ్గంటలసేపు కొంచెం శుభ్రంగా ఉండు. ఇంటికి వెళ్లింతర్వాత నీ విశ్వరూపం ప్రదర్శిద్దువుగాని" అన్నాడు, పెద్దమ్మాయి రాణి చేయి పట్టుకుని గేటుదాటి తోటలో నడుస్తూ.

సీతకు తన శుభ్రతకన్నా పిల్లల శుభ్రత ముఖ్యం. తను శుభ్రంగా ఉండాలనుకున్నా పిల్లలుండ నివ్వరు. పిల్లలు ఖరాబుగా ఉండాలనుకున్నా ఈమె ఉండ నివ్వదు.

సీత ముదురు రంగు హేండ్‌లూమ్ చీర కట్టుకుంది. అంతకంటె విలువైన చీర తన దగ్గరలేదు. ఉన్నా కట్టదు. కట్టినా ఖరాబైపోతుందని ఆమె భయం. అస లలాంటి వేవీ కోరదు గూడా. ఆమెకు ఏ చీర కట్టినా అందంగానే ఉంటుంది. ఎన్ని ఇబ్బందులలోనైనా వాడని చిరునగవుమోమే ఆమెకు పెట్టని ఆభరణం. జాకెట్టు కూడా చీర రంగే! ఆమె పెట్టుకున్న ఆభరణమల్లా మెడలో ఒక్కబంగారు గొలుసుమాత్రమే!

పిల్లలకిమాత్రం మడతలు నలగని అందమైన రెడిమేడ్ డ్రస్ తొడిగింది. చక్కగా తలలు దువ్వి ముస్తాబు చేసింది. ఆ డ్రస్సులో పిల్లలు ముగ్గురూ రబ్బరు బొమ్మల్లా, చూచేవాళ్లకి ముద్దొస్తున్నారు.

"నాన్నా! వీళ్ల కీ పూల మొక్కలన్నీ ఎక్కడివి నాన్నా? మా బడిలో కూడా లేవు ఇన్ని రకాలు" అన్నది రాణి.

"ఇక్కడేమీ అడక్కు. అన్నీ ఇంటికి వెళ్లింతర్వాత చెబుతాను తీరిగ్గా" అన్నాడు రావు.

"ఇంటిముందు మల్లె గుబురు ఎంత నిండుగా విరగబూసి ఉందండీ?" అన్నది సీత, తను ఆగి, వెనక పడ్డ ప్రసన్నకుమార్‌ని ముందుకు నడిపిస్తూ.

వరండాలో ఉన్న కుక్క వీళ్లను చూడగానే సింహంలా లేచింది, 'భౌ—భౌ' మని అరుస్తూ. పిల్లలందరూ దాని అరుపులకు అమ్మ నాన్నలకు అతుక్కుపోయారు, కంగారుతో.

"ఎద్దులా ఎంత ఎత్తుందండీ ఆ కుక్క? పిల్లలు భయపడిపోయారు. ఆ గొలుసే లేకుంటే ఇంతవరకు మన గతి ఏమయ్యుండేది?" అన్నది వొణుకుతూ పిల్లల్ని చేర్చి పట్టుకుంటూ.

"ఏమిటా అదురు? పిల్లలకంటె ముందు నిన్నే ఆస్పత్రికి చేర్చవలసినట్టుందే!" అన్నాడు తన కాళ్ల కతుక్కుపోయిన రాణి వీపు నిమురుతూ.

"ఏమో బాబు! నే నెప్పుడూ చూడలే దింత కుక్కను. అసలు దీన్ని కుక్కంటే నమ్మలేక పోతున్నాను" అన్నది.

ఇంతలో ఇంట్లోనుంచి చంద్రం, సునంద వరండాలోకి వచ్చారు. వాళ్ల హెచ్చరికను వినగానే కుక్క నోరు మూసుకుని తోకాడించింది. తోకాడించడంలో కూడా దాని దర్జాను విడచిపెట్టలేదు.

"నమస్కారం సార్!" అన్నాడు రావు.

"నమస్కారం. రండి! రండి!"అన్నాడుచంద్రం.

"టామీని చూచి పిల్లలు భయపడుతున్నట్టున్నారే! రండమ్మా! అదేమీ చెయ్యదు. నేనున్నాగా. రండి!" అంటూ ఆప్యాయంగా పిలిచింది సునంద. ముందుకొచ్చి గోపీని ఎత్తుకుంది.

"మీరింతవరకి ఆఫీసుకి లేటయ్యిందిలేదు. అలాంటి మీరు ఇవాళ ఇంత ఆలస్యం చేశారంటే ఇంక రారేమో అనుకున్నాను" అన్నాడు చంద్రం, సగం కొరుక్కున్న నవ్వుతో.

"ఎక్కడ సార్! పిల్లలతో ప్రయాణం. అడుక్కొక ఆటంకం. అందులోనూ ఈ ఆడవాళ్లతో ప్రయాణం ఉంది చూశారూ!" అన్నాడు రావు, సీత వేపు కొంటెగా చూస్తూ.

"ఆ మాటే నేనంటే మా ఆవిడ వినదే! ఈ కాలం ప్రయాణం కావడంలోమగవాళ్లకంటే ఆడవాళ్లే నయమంటుంది" అంటూ సునందవేపు చూశాడు చంద్రం.

"అప్పుడే ప్రారంభమైందీ, ఆడవాళ్లని ఆడిపోసుకోవడం? చాలు చాలు రండి లోపలికి" అని చంద్రంవేపు కొరకొరా చూచి డ్రాయింగ్ రూములోకి ప్రవేశించింది, సునంద.

ఆమె వెనకనే చంద్రం ప్రవేశించాడు.

రావు వరండాలోనే చెప్పులు తీసేశాడు. సీత గూడా చెప్పులు తీసేసి గడప ముందున్న తివాచీకి కాళ్లు తగలకుండా దాటుకోవడానికి తంటాలు పడుతోంది.

"శ్రీరామోహమా! ఏమిటా పులడుగు? కాళ్లు తుడుచుకునే తివాచీ అది. వీధి భాగోతం చాలించి నీ బంగారు కాళ్లు దానికి తుడుచుకుని లోపలికి పో!" అని గొంతు తగ్గించి కసురుకున్నాడు రావు, ముందు వాళ్లకి వినబడకుండా.

"ఇంతందంగా ఉంది. దీనిమీద కాళ్లు ఎలా తుడవనండీ?" అన్నది ఏదో రహస్యం చెబుతున్నదానికి మల్లే.

"ఖర్మ! నిన్ను పిలుచుకువచ్చాను!" అని విసుగ్గా తివాచీకి కాళ్లు తుడుచుకుని వెళ్లాడు, డ్రాయింగు రూములోకి.

సీత తివాచీమీద కాళ్లు తుడుచుకుంది. తుడుచుకుంటున్నప్పు డది మెత్తగా కాళ్లకు గిలిగింతలు పెట్టింది. 'కాళ్లు తుడుచుకోవడాని కింత విలువైనదాన్నా వీళ్లు ఉపయోగించుకొంటున్నా'రని ఆశ్చర్యపోయింది. దాన్ని దాటుకుని వెళ్లింది. మళ్లీ వెనక్కి తిరిగి చూచింది. తివాచీనిచూచి తన చీరను చూచుకుంది. రెండూ ఒకటే రంగు. ముదురు నీలం రంగు. రెంటికీ ఏదో సంబంధమున్నట్టుగా తోచిందామెకు.

సీత డ్రాయింగ్‌రూంలో అడుగు పెట్టింది. అందరిలాగే అడుగైతే పెట్టిందికానీ, ఆ గదిలోని విలువైన అలంకారాల్నీ, అంతకంటె అద్దంలా మెరిసిపోయే దాని శుభ్రతనీ చూడగానే అందులో అడుగు పెట్టడానికి తనకు అర్హత లేదేమో అనేంత బిడియమూ, పిరికితనమూ తన్ను స్తబ్ధురాల్ని చేసేశాయి. ఆ గదిని చూచి మళ్లీ వెనక్కి తిరిగి తివాచీని చూచింది. నిగనిగలాడే తివాచీమీద అప్పుడేపడ్డ మరకలు తన్ను వెక్కిరించాయి.

"రండి! అలాగే నిలబడిపోయారేమిటి? ఇలా వచ్చి కూర్చోండి" అని సునంద సోఫా చూపింది.

ఆ మాటతో ఉలిక్కిపడ్డట్టుగా వాళ్లవేపు చూచింది. అందరూ అంతవరకే ఆసీనులై ఉన్నారు. తను కూడా వెళ్లి కూర్చుంది. తను కూర్చున్నచోట సోఫా మెత్తగా క్రిందికి వెళ్లిపోయింది. తనకేమో అదంతా ఏదో మయసభలా తోచింది.

ఇంతలో హొటల్లో సర్వర్‌లాగా ట్రేలో కాఫీలుతెచ్చి అద్దంలా నిగనిగలాడే టీపాయ్‌మీద పెట్టారెవరో! సునంద అందరికీ కాఫీలు అందిస్తోంది. ఇదంతా ఆశ్చర్యంగా చూస్తున్న సీతకు గూడా ఒక కాఫీ కప్పు అందించింది. మారు మాట్లాడకుండా తీసుకుంది, సీత.

"నేను గోపీకి కాఫీ తాగిస్తాను. మీరు పెద్దబ్బాయికి తాగించండి" అన్నది సునంద సీతతో, గోపీని తన ప్రక్క సోఫాలో కూర్చోబెట్టుకుని కాఫీ చల్లార్చుతూ.

ఆమె ఆప్యాయతను చూస్తుంటే సీతకు ఆశ్చర్యం వేసింది.

రాణి, వాళ్లనాన్న ప్రక్క కూర్చుని బుద్ధిగా కాఫీ త్రాగుతోంది. ప్రసన్నకుమార్‌ని తన ఒడిలో కూర్చోబెట్టుకుని కాఫీ తాగిస్తోంది సీత!

"మల్లె గుబురు ఇంటిముందు చాల అందంగా ఉంది. దాని వాసన కిటికీలోంచి ఇక్కడికి గూడా వస్తోంది" అన్నది సీత, కిటికీవేపు చూస్తూ.

"సీతకు మల్లెపూవులుంటే చాలు. అవే ప్రాణం" అన్నాడు రావు.

"పెరట్లో ఒక మల్లెమొక్క నాటమంటే వినిపించుకోరు. మనం అద్దెకొంప జీవులం. రేపు ఈ ఇంట్లోనే ఉంటామనే నమ్మకమేముంది అని కొట్టి పారేస్తారు" అన్నది సీత.

"అదీ నిజమే!" అన్నాడు చంద్రం.

"ఇంతెందుకు? ఆ చూచేదేదో మల్లెచెట్టున్న ఇల్లే చూచుకుంటే సరిపోలే?" అన్నది తేలిగ్గా సునంద.

"చూడు. కత్తి లేకుండానే సొరకాయ లెలా తెగిపోతున్నాయో?" అన్నాడు చంద్రం.

"అద్దెకొంపల సంగతి వారికెలా తెలుస్తుందండీ? చిన్నప్పటినుంచి ఏ కష్టమూ తెలియకుండా సుకుమారంగా పెరిగిన వారాయె!" అన్నాడు రావు సర్దిచెప్పే రీతిలో.

సీలింగ్ ఫేన్ మెత్తగా తిరుగుతోంది. రేడియోగ్రాం నుంచి సన్నటి సంగీతం వినవస్తోంది. చంద్రం, రావు ఏవో ఆఫీసు గొడవల్లో పడ్డారు.

"మీరు మొహం కడుక్కుంటారా?" అన్నది సునంద, సీతవేపు తిరిగి.

"ఇప్పుడేగా స్నానంచేసి వస్తున్నాం. ఏమీ వద్దులెండి" అన్నది సీత.

సునంద గోపీని ఒడిలో కూర్చోబెట్టుకుంది.

"బాబూ! నీ పేరేమిటి?" అన్నది, గోపీ ముద్దు ముద్దు మాటలు వినాలనే కోరికతో.

"నోపి" అన్నాడు.

"మరి అక్క పేరో?" అన్నది నవ్వుతూ.

"లాని".

సునంద నవ్వు ఆపుకోలేకపోయింది.

"వాళ్లన్నపేరడగండి!" అన్నది సీత కూడా నవ్వుతూ.

"నీకు అన్నపేరు తెలుసా?" అన్నది సునంద నవ్వాపుకుంటూ.

తెలుసన్నట్టు తల వూపాడు.

"ఏం పేరో చెప్పు చూద్దాం?".

"నాకు లాదు."

"అమ్మదొంగ! నువ్వు మంచి గోపీవి కదూ! చెప్పావంటే నీకు చాక్లెట్ ఇస్తాను" అన్నది, ముద్దుగా బుజ్జగిస్తూ.

"ఊలికేనే!" అన్నాడు నంగిగా.

"ఊలికేనా? అని పగలబడి నవ్వింది సునంద. అంతలోనే నవ్వాపుకుని— "ఊరికేకాదమ్మా! నిజంగానే! వెంకన్నా! బాబుకి చాక్లెట్లు తీసుకురా!" అని ఇంటివేపు తిరిగి కేక పెట్టింది..

మరుక్షణంలోనే వెంకన్న చాక్లెట్ డబ్బా తెచ్చి ఇచ్చాడు. డబ్బా తెరిచి ఒక చాక్లెట్‌తీసి గోపీ చేతికందివ్వబోయింది సునంద. గోపీ ఒప్పుకోలేదు. డబ్బానే కావాలన్నాడు. ఇచ్చేసింది. చాకెట్లు చూడగానే వాళ్లనాన్న దగ్గరున్న రాణి, తల్లిదగ్గరున్న ప్రసన్నకుమార్ అందరూ సునంద దగ్గరికి చేరారు.

"చాక్లెట్లు అక్కకూ, అన్నకూ ఇవ్వవూ" అన్నది సునంద.

గోపీయే డబ్బాలోంచి రెండు చాకెట్లుతీసి చెరొకటి ఇచ్చాడు.

"ఇప్పుడు చెప్పు, అన్న పేరేమిటో?" అన్నది సునంద.

"బతన్న" అన్నాడు గోపీ అతికష్టంమీద.

మళ్లీ నవ్వొందుకుంది, సునంద.

"బతన్న కాదు గోపీ! ప్రసన్నకుమార్ అనాలి" అన్నది రాణి చాక్లెట్ చప్పరిస్తూ.

* * *

బిగ్ ఫియట్ ఆగింది, ఒక్క ఊపుతో. ఆ ఊపుకు రాణి వాళ్లనాన్నని పట్టుకుంది, ముందుకి పడబోయి. ప్రసన్న వాళ్లతల్లి ఒడిలో కూర్చున్నాడు. గోపీ మాత్రం సునంద ఒడిలో ఉన్నాడు. వాడామెను వదల్లేదు. ఆమె వాడ్ని వదల్లేదు.

అందరూ కారులోంచి దిగారు.

ఇసుకలో నడుస్తున్నారు.

"జనం మరీ ఎక్కువగా ఉన్నా రివాళ" అన్నది సునంద.

"ఏమండి! ఈ బీచ్, ముదురు నీలంరంగు చీరకి రంగు రంగుల డిజైన్ వచ్చిన తెల్లనరిగంచులా లేదూ?" అన్నది సీత భర్తతో.

"నీవు రచయిత్రివై వుండవలసింది. పొర బాటున నా పెళ్ళానివై పోయావు." అన్నాడు రావు.

"మీ కంతా వేళాకోళమే!"

"వేళాకోళం కాదు. నేడు సాహిత్య సామ్రాజ్యాన్ని స్త్రీలే ఏలుతున్నారు" అన్నాడు రావు, రాణి చెయ్యి పట్టుకుని నడుస్తూ.

రాణి, ప్రసన్న ఇసుకలో నడుస్తూంటే,తను గూడా వాళ్లలాగే నడవాలని సునంద చేతులో నుంచి దిగాలని మారాం చేస్తున్నాడు గోపి.

"వద్దు గోపీ! ఇసుకలో నువ్వు నడవలేవు" అన్నది సునంద.

"లానీ....ఊఁ..... బతన్న.....నలత్తాలు. నేను నలత్తాను" అన్నాడు గోపి నంగినంగిగా రాగంతీస్తూ.

"అమ్మో! అమ్మో! ఉపన్యాసం దంచేస్తున్నావే! నడవరా బాబూ నడువు!" అన్నది గోపీని క్రిందికి దింపుతూ సునంద.

"పట్టితే పట్టు అంతే! అప్పుడే వాళ్ల నాన్నను మించిపోతున్నాడు" అన్నది సీత.

"నీలాగా మొండిపట్టు కాదుగదా!" అన్నాడు రావు కొంటెగా.

అందరూ నడుస్తున్నారు. సీత చుట్టూ కలయజూస్తూ నడుస్తోంది. ఆమెకంతా ఆశ్చర్యంగా ఉంది. కొనేవాళ్లూ, తినేవాళ్లూ, తిరిగేవాళ్లూ,నవ్వే వాళ్లూ, అమ్మేవాళ్లూ, అరిచేవాళ్లూ, పక్కవాళ్లని కసురుకునే వాళ్లు, గుంపుగా కూర్చుని కబుర్లాడు కునేవాళ్లూ, ఖరీదైన బట్టల్లో అర్ధనగ్నంగా తమ అవయవాల సొంపును ప్రదర్శించే వాళ్లూ, చిరిగిన బట్టల్లో అవయవాలను దాచడానికి తంటాలు పడే వాళ్లూ, మంచివాళ్లూ, మంచి తెలియని వాళ్లూ, కూలీలు, గుమస్తాలు, కుంటివాళ్లు, ధనికులు, అధికారులు, గుడ్డివాళ్లు—అందరూ ఒక కప్పుక్రింద సోషలిజం కోసం ప్రాకులాడుతున్నట్టు— ఒకటే సందడి! సముద్రం ఒడ్డున ఎవరిదో పెళ్లిజరుగుతున్నట్టు ఒకటే హడావిడి! ఎవరికీ తీరికలేదు.

"ఇక్కడ కూర్చుందాం" అంది సునంద.

"ఏం? కాళ్లు నొప్పులెట్టాయా?" అన్నాడు చంద్రం.

"మీకేం? పోక చెట్టులా వెళ్లిపోతారు." అన్నది సునంద కొంటెగా.

"నీకు కొమ్మలూ, రెమ్మలూ ఉన్నాయేమిటి?" అన్నాడు ఎత్తిపొడుస్తూ చంద్రం.

"గోపీ నడవలేకున్నాడు".

"ఎత్తుకో".

"ఏడుస్తాడు".

ఆమెతో వాదులాడుతూనే చంద్రం కాలితో ఇసుక చదును చేసి కూర్చున్నాడు. అందరూ గుండ్రని ఆకారంలో కూర్చున్నారు.

"మాఇల్లంతా చూశారుగదా. ఇప్పుడు చెప్పండి—మాఇంట్లో మీకేం నచ్చిందో?" అన్నది సునంద, ప్రక్కన కూర్చున్న సీతకేసిచూస్తో.

"మీ ఇల్లు ఇంద్రభవనంలా ఉంది. ఇది నచ్చిందని ఎలా చెప్పడం?" అన్నది సీత, చిరునవ్వుతో.

"తప్పించుకునే మాట లివన్నీ. చెప్పేదాకా వదిలేదిలేదు." అన్నది సునంద పంతంతో.

"ఇల్లంతా నచ్చింది" అన్నది సీత బుడుంగున.

"ఇది మరీ బాగుంది" అన్నది సునంద నిష్ఠూరంగా.

"పోనీ, మీరు చెప్పండి?" అన్నది సీత, భర్తవేపు తిరిగి.

రావు ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నవ్వుతో సీత మొహంలోకి చూస్తూ ఉండిపోయాడు.

ఇంతలో వేరుసెనగపప్పు అమ్మేవా డటువేపు వచ్చాడు. గోపీ వాడి వేపే ఆత్రంగా చూస్తున్నాడు. దాన్ని గమనించి సునంద పప్పులమ్మేవాడ్ని పిలిచింది.

తలా ఒక పొట్లం ఇప్పించింది. తనూ ఒకటి తీసుకుంది. భర్తను డబ్బులు ఇవ్వమంది. రావు ఇవ్వడానికి జేబులో చెయ్యి వేశాడు. చంద్రం అతన్ని వారించి తనే ఇచ్చాడు.

''నిజానికి ముందు మీరు చెప్పాలి. తర్వాతే మేము'' అన్నాడు రావు పప్పులు తింటూ.

''విపర్యయం కాకూడదా ఏమిటి?'' అన్నాడు చంద్రం.

''కావచ్చు ననుకోండి. కానీ, ముందు మా యింటిని మీరు చూశారు. తర్వాత మీ యింటిని మేం చూశాం. విపర్యయానికి పోతే క్రమాలంకారం దెబ్బ తింటుంది.''

''క్రమాలంకారాన్ని దెబ్బతీయడంలోనే ఉంది నావల్టీ!'' అన్నాడు చంద్రం నవ్వుతూ.

''సరే! అలాగే చెబుతాను. మీ యింట్లో నాకు నచ్చింది మల్లెపందిరి'' అన్నాడు రావు.

''మేమూ అలాగే ఊహించాము, మీకు అదే నచ్చి ఉంటుందని!'' అన్నది సునంద.

''ఇప్పుడు మీరు చెప్పాలి'' అన్నాడు రావు చంద్రం వేపుచూసి.

''మీ శ్రీమతిగారు చెప్పాలి. ఆ తర్వాత మేము. మీ శ్రీమతికి గూడా అదే నచ్చి ఉంటుందనుకుంటాను.'' అన్నాడు చంద్రం.

''నేను చివర చెబుతాను'' అన్నది సీత.

''పోనీ, సునందా! నువ్వు చెప్పు'' అన్నాడు చంద్రం, సునంద వేపు చూస్తూ.

''మీకు మా ఇంట్లో మల్లె పందిరి నచ్చిందన్నారు. నాకు గూడా మీ ఇంట్లో మల్లిపందిరే నచ్చింది'' అన్నది సునంద నవ్వుతూ.

''అదేమిటి? మా యింట్లో మల్లె పందిరెక్కడిది? మీరేదో గమ్మత్తు చేస్తున్నారు'' అన్నది సీత అమాయికంగా.

''గమ్మత్తు కాదండి. నిజంగానే. ఈ పిల్లలే మీ ఇంట్లో మల్లెపందిరిలాంటివాళ్ళు. వీళ్ళ వాడని మల్లెపూలు. వీళ్ల నవ్వులు చెరగని పరిమళాలు'' అన్నది సునంద, తన ఒడిలో ఉన్న గోపీ పాలబుగ్గల్ని నిమురుతూ.

''మీ అభిప్రాయం చెప్పనేలేదు'' అన్నాడు రావు చంద్రంవేపు చూసి నవ్వుతూ.

''ఏముంది చెప్పడానికి? సునందతో డిటో'' అన్నాడు చంద్రం.

''తెలిగ్గా తప్పుకున్నారు'' అన్నాడు రావు నవ్వుతూ.

''ఆయనైనా ఫలానా అని చెప్పారు. మీ శ్రీమతిగా రసలు చివర చెబుతానని వాయిదా వేస్తున్నారు'' అన్నది సునంద.

''చెప్పు సీతా! అందరూ అయ్యారుగా, నువ్వే మిగిలావు, నీకు నచ్చిందేదో చెప్పు'' అన్నాడు రావు సీత వేపు తిరిగి.

గోపీ పప్పులు తిని అయిపోయింది. సునంద ఒడిలోంచి లేచి సీత దగ్గరకు వచ్చాడు. సీత గోపీని అందుకుని దగ్గరికి తీసుకుంది. పప్పులు తినే తొందరలో మొహమంతా ఖరాబు చేసుకుని ఉన్నాడు.

''చెప్పరా?'' అన్నది సునంద.

''చెప్పకపోతే వదులుతారా?''

''మరెందుకీ సస్పెన్సు?'' అన్నది సునంద ఆలస్యాన్ని భరించలేక.

''మీ యిల్లు అంత శుభ్రంగా ఉండంటే దానికి మీ జాగ్రత్త కొంత కారణం. మీ జాగ్రత్తతో పాటు వరండాలోఉన్న తివాచీ గూడ కొంత కారణం. ఇతర్ల శుభ్రతకోసం అంత అందమైన తివాచీ తన్ను మలినపరచుకొంటోంది. అది అలా మలినపరచుకోవడంలోనే దానికెంతో ఆనందం ఉందని గూడా అనుకుంటాను'' అన్నది సీత, తన చీర చెరగుతో గోపీ మరకల ముఖాన్ని తుడుస్తూ.

''అంటే—మీ కా తివాచీ నచ్చిందన్నమాట!'' అన్నది సునంద ఆశ్చర్యంగా.

రావు, సీతను తివాచీని చూచినట్లు చూశాడు, ఆక్షణంలో.